తాను కష్టాలలో ఉన్నప్పుడు
కూడా
నవ్వగలిగే వారు
నాకు ఆదర్శం

తాను ఆపదలో ఉన్నప్పుడు
కూడా
ఇతరులకు సహాయం
చేయగలిగే వారు
నాకు స్ఫూర్తి

# DD9 వార్త
తెలుగు దినపత్రిక


## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు
విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



02

సంపుటి : 01 సంచిక : 221 హైదరాబాద్, మార్చి, బుధవారం 01, 2026 పేజీలు : 06 వెల : 3.00

# విజయవంతంగా మహాలక్ష్మి పథకం అమలు

ఉచిత బస్సుపై మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యలు
అధికారంలోకి వచ్చిన వెంటనే పథకం అమలు
మక్తల్‌లో మహాలక్ష్మి పథకంపై మంత్రి సమీక్ష
ప్రచారంలో ఆర్టీసీ నిర్లక్ష్యంపై మంత్రి అసహనం
మహిళల ప్రయాణాలతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందన్న నివేదిక
గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాల విస్తరణపై దృష్టి
ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు సూచనలు
పాత బస్టాండ్ స్థానంలో కొత్త నిర్మాణానికి హామీ
అధికారులతో సమన్వయం పెంచాలని ఆదేశాలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో మహిళల సాధికారత లక్ష్యంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిసేపటికే ఈ పథకాన్ని అమలు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపర్చడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించబడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం మంచి స్పందన పొందుతోందని వివరించారు.
మక్తల్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ అధికారులు, జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ..మిగతా 2లో

# బీహార్‌లో తీవ్ర విషాదం..!




నలంద జిల్లాలోని ఆలయంలో తొక్కిసలాట
## భక్తుల రద్దీతో పలువురు మృతి
శీత్లా మాత ఆలయంలో ఘటన
పదుల సంఖ్యలో గాయపడ్డ భక్తులు
భద్రతా ఏర్పాట్ల లోపంపై స్థానికుల ఆగ్రహం
ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు
బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్న నాయకులు
ఘటనపై ప్రధాని మోడీ సంతాపం, పరిహారం ప్రకటన

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
బీహార్ రాష్ట్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. జిల్లాలోని మాఘ్రా ప్రాంతంలో ఉన్న శీత్లా మాతా ఆలయం వద్ద మంగళవారం ఉదయం జరిగిన తొక్కిసలాటలో పలువురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో కనీసం ఎనిమిది మంది మరణించి ఉంటారని ప్రాథమిక సమాచారం సూచిస్తున్నప్పటికీ, అధికారిక వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఈ సంఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

**భారీ రద్దీతో ప్రమాదం**
చైత్ర మాసం చివరి మంగళవారం సందర్భంగా ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే దర్శనార్థం వందల సంఖ్యలో
..మిగతా 2లో

# పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

సమ్మక్క జాతర ఘటనపై దర్యాప్తు వేగం
జాతర వివాదంపై
కేసు నమోదు, సీఐడీకి బదిలీ
ఏప్రిల్ 4న విచారణకు
హాజరు కావాలని ఆదేశం
పోలీసు విధుల్లో ఆటంకం
కలిగించారని ఆరోపణలు
ట్రాఫిక్ అంతరాయం,
గుమికూడిన జన సమూహంపై కేసు
అధికారులపై అనుచిత
వ్యాఖ్యలు చేశారన్న అభియోగాలు
సోషల్ మీడియాలో
వైరల్ అయిన వీడియోలు కీలకం
విచారణకు
సహకరించకపోతే చర్యల హెచ్చరిక

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారిన సమ్మక్కసారలమ్మ జాతర ఘటనపై దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో భాగంగా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ..మిగతా 3లో



# రాజకీయాల్లోకి జీవన్ రెడ్డి కోడలు చరిష్మారెడ్డి!



వారసత్వ రాజకీయాలకు ఊపు
జీవన్ రెడ్డి వ్యూహం ఇదేనా?
మహిళా కోటా ఎఫెక్ట్
మారుతున్న రాజకీయ సమీకరణాలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ పాలిటిక్స్ క్రమంగా ఊపందుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 27 నెలలు గడుస్తోంది. ఈ ప్రభుత్వానికి అధికారం మరో రెండున్నరేళ్లు మిగిలి ఉండగానే రాబోయే ఎన్నికలపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. మరోసారి అధికారం తమదేనంటూ రేవంత్ రెడ్డి పదే పదే చెబుతుంటే, మళ్లీ మిమ్మల్ని ..మిగతా 2లో

# సెమీకండక్టర్ రంగంలో దూసుకెళ్తున్న భారత్

సనంద్‌లో కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ
స్వయం సమృద్ధి లక్ష్యంతో సెమీకండక్టర్ మిషన్‌కు ఊతం
గుజరాత్ సనంద్‌లో రూ.3,300 కోట్లతో ఆధునిక ప్లాంట్ ప్రారంభం
ప్రపంచ సరఫరా గొలుసులో బలపడుతున్న భారత్ స్థానం
రోజుకు లక్షల సంఖ్యలో చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యం
ఎలక్ట్రిక్ వాహనాలు, పరిశ్రమలకు కీలకమైన ఐపీఎంల తయారీ
మహావీర్ జయంతి సందర్భంగా సమ్రాట్ సంప్రతి మ్యూజియం ఆవిష్కరణ
మైక్రాన్ ప్రాజెక్ట్ వేగం ఉదాహరణగా ప్రధాని వ్యాఖ్యలు



03

# అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు





కేరళ ప్రచారం కోసం
30ననే అసెంబ్లీ వాయిదా
కాళేశ్వరంపై కేంద్రమంత్రి
వ్యాఖ్యలు సరికావు
మీడియా సమావేశంలో
బిఆరఎస్ నేత హరీష్ రావు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ..మిగతా 2లో

# బీఆర్ఎస్ వెంటే ఉండాలని మహిపాల్ రెడ్డి డిసైడ్ అయ్యారా?



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఆయన అధికార పార్టీ గూడు కోసం తపించారు. అడుగులు బలంగా వుండాలంటే పొజిషన్‌లో వుండాలని ఆలోచించారు. వుంటే వుండని ప్రాబ్లమ్ లేదు కదా అని పవర్ పార్టీ కూడా భావించింది. కానీ అప్పటికే సెగ్మెంట్‌లో తిష్టవేసిన గ్రూప్ వార్....నెక్స్ట్ లెవల్‌కి వెళ్లింది. దీంతో ఆయన్ను ఎలా వదిలించుకోవాలా అని ఎదురుచూసిన అధికార పార్టీకి, ఆయనే అవకాశమిచ్చారు. సభలో సీఎం స్పీచ్‌తో క్లియర్ కట్ పిక్చర్ వచ్చేసింది. ఇంతకీ ఎవరాయన? ..మిగతా 2లో

ఆయనకు అధికార పార్టీ గుడ్ బై చెప్పిందా?
ఆయనే గుడ్‌బై చెప్పాల్సి వచ్చిందా?
సభలో సదరు ఎమ్మెల్యే తన ప్రవర్తనతో క్లారిటీ ఇచ్చారా?
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై ఫుల్ క్లారిటీ?

## రాజకీయాల్లోకి జీవన్ రెడ్డి కోడలు చరిష్మారెడ్డి!



**మొదటిపేజీ తరువాయి**

రానిచ్చేది లేదంటూ విపక్షాలు స్కెచ్చులు వేస్తున్నాయి. అయితే పార్టీల మధ్య పోరు ఇలా ఉంటే వచ్చే ఎన్నికల నాటికి తమ వారసులను బరిలోకి దింపేందుకు నేతలు గ్రౌండ్ వర్క్ పక్కాగా ప్రిపేర్ చేస్తుండటం ఆసక్తిని రేపుతోంది. దీపం ఉండగానే ఇంటిని చక్క బెట్టుకోవాలన్నట్లు అవకాశాలు ఉన్నప్పుడే తమ వారసులకు బెర్త్ లను సెట్ చేసేందుకు సీనియర్ నేతలు స్కెచ్‌లు వేస్తున్నారు.

**రాజకీయాల్లోకి జీవన్ రెడ్డి కోడలు!**

అధికార కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి విషయంలో ఓ ఆసక్తికర చర్చ తెరమీదకు వచ్చింది. త్వరలో జీవన్ రెడ్డి కోడలు చరిష్మారెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు పొలిటికల్ కారిడార్‌లో ప్రచారం జరుగుతోంది. కోడలిని బరిలోకి దింపడానికి పెద్దాయన గ్రౌండ్ రెడీ చేస్తున్నారని ఈ వ్యూహంలో భాగంగానే ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారనే ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకోబోతున్నారని అక్కడ జీవన్ రెడ్డికి సెక్రటరీ జనరల్ పోస్టు అందుకోనుండగా కోడలికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

**భారీగా మార్పులు?**

త్వరలో నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళా కోటా బిల్లును కేంద్ర అమలు చేయబోతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. ఇదే అదునుగా రాష్ట్రంలోని ముఖ్య నేతలంతా తమ తమ వారసులను బరిలోకి దింపేందుకు రూట్ మ్యాప్ రెడీ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్లు వచ్చే స్థానాలపై ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలతో పాటు ముఖ్యనేతలంతా దృష్టి సారించారు. తమకు అనుకూలమైన చోట్ల తమ వారసులను సెట్ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తాము కోరిన విధంగా అవకాశం ఇస్తే సరి లేదా కండువా మార్చేందుకు అన్ని పార్టీలలోని ఆశావహ నేతలు ఆలోచనలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఎవరు ఎటువైపు?**

రాష్ట్ర రాజకీయాలు ఇప్పటి వరకు ఒక లెక్క ఇకపై మరో లెక్క అనేలా సాగబోతున్నట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీ మధ్య బిగ్ ఫైట్ కొనసాగనుండగా కొత్తగా కల్వకుంట్ల కవిత పార్టీని స్థాపించబోతున్నారు. వచ్చేనెలలోనే ఆమె తన పార్టీని అనౌన్స్ చేయబోతున్నారు. దీంతో అవకాశాలు దక్కకపోతే చివరి వరకు పార్టీ కోసం నిలబడతారా అనేది సందేహంగా మారింది. దీంతో కొత్త పార్టీలు, మహిళా కోటాతో ఎన్నికల నాటికి ఎవరు ఎటువైపు ఉంటారనేది వేచి చూడాలి.

## విజయవంతంగా మహాలక్ష్మి పథకం అమలు

**మొదటిపేజీ తరువాయి**



సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వారిని సన్మానించారు. అయితే కార్యక్రమ నిర్వహణను పరిశీలించిన మంత్రి, మహాలక్ష్మి పథకం ప్రచారంలో ఆర్టీసీ అధికారులు తగిన చొరవ చూపడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తూ, వారు ప్రయాణించిన దూరానికి ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లింపులు చేస్తున్నప్పటికీ, ఈ విషయాన్ని ప్రజలకు సరిగా తెలియజేయడం లేదని మంత్రి అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వేదికను చూస్తేనే పథకంపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ పథకం ద్వారా ఇప్పటివరకు కోట్లాది మహిళలు ప్రయాణించారని మంత్రి తెలిపారు. మహిళలు స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం కలగడం వల్ల కుటుంబాల్లో కూడా ఆర్థిక వ్యవహారాల్లో మార్పులు వస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల చేతుల్లో ఖర్చు నిర్ణయాలు ఉండటం వల్ల కుటుంబ సంక్షేమం మెరుగుపడుతుందని అన్నారు. ఈ పథకం ఆ దిశగా మంచి ఫలితాలను ఇస్తోందని చెప్పారు.ఆర్టీసీకి కూడా ఈ పథకం ద్వారా ఆదాయం పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. మహిళల ప్రయాణాలకు ప్రభుత్వం చెల్లింపులు చేయడం వల్ల సంస్థ ఆర్థికంగా బలపడుతోందని వివరించారు. కొన్ని జిల్లాల్లో రోజువారీగా లక్షల రూపాయల ఆదాయం వస్తోందని తెలిపారు. ఆర్టీసీ లాభాల బాటలో కొనసాగుతుండటం ఈ పథకం విజయానికి నిదర్శనమని అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సౌకర్యాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు సులభంగా ప్రయాణించేందుకు తగిన సంఖ్యలో బస్సులు నడపాలని ఆదేశించారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే వారికి అనుకూలంగా టైమ్‌టేబుల్ రూపొందించాలని చెప్పారు. రాత్రి సమయంలో కూడా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఎక్స్‌ప్రెస్ బస్సులను అవసరమైన స్టాప్‌ల వద్ద ఆపాలని సూచించారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ ప్రధాన బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. బస్సుల్లో శుభ్రత, సమయపాలన, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి రాజీ పడకూడదని చెప్పారు. ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని సూచించారు. అధికారులు బాధ్యతతో వ్యవహరిస్తేనే పథకాల ప్రయోజనం పూర్తిగా అందుతుందని అన్నారు. మక్తల్ పట్టణంలో బస్టాండ్ పరిస్థితిపై కూడా మంత్రి స్పందించారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్ ఇరుకుగా మారి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ బస్టాండ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని పేర్కొన్నారు. జనాభా పెరుగుదలతో పాటు ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ప్రస్తుత సౌకర్యాలు సరిపోవడం లేదన్నారు.ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని కొత్త బస్టాండ్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. సుమారు నాలుగు కోట్ల రూపాయలతో విశాలంగా, ఆధునిక సౌకర్యాలతో కూడిన బస్టాండ్ నిర్మిస్తామని చెప్పారు. ప్రయాణికులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు.

బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన భూమి, రెవెన్యూ రికార్డులు త్వరగా అందజేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయం చేసుకుని పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా తమకు కలిగిన ప్రయోజనాలను మహిళలు వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం తమ జీవన విధానంలో మార్పు తీసుకువచ్చిందని వారు తెలిపారు.మహాలక్ష్మి పథకం మహిళల సాధికారతకు దోహదపడటంతో పాటు ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

# బీహార్‌లో తీవ్ర విషాదం..!

**మొదటిపేజీ తరువాయి**

భక్తులు చేరుకున్నారు. సమయం గడిచేకొద్దీ జనసందోహం మరింత పెరిగింది. ఆలయం పరిసరాల్లో సరైన స్థలం లేకపోవడం, రద్దీని నియంత్రించేందుకు తగిన ఏర్పాట్లు లేకపోవడం వల్ల పరిస్థితి అదుపుతప్పింది.ఈ క్రమంలో ఒక్కసారిగా తొక్కిసలాట చోటుచేసుకుంది. భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. కొందరు అక్కడికక్కడే స్పృహ కోల్పోయారు. పరిస్థితి మరింత విషమించడంతో ప్రమాదం పెరిగింది.

**వెంటనే స్పందించిన పోలీసులు**

ఘటన సమాచారం అందుకున్న వెంటనే దీప్‌నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని త్వరితగతిన సమీప ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు మరియు స్థానికులు కలిసి సహాయక చర్యలు చేపట్టారు.ప్రస్తుతం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. భక్తులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. పరిస్థితి పూర్తిగా చల్లారే వరకు భద్రతా చర్యలు కొనసాగనున్నట్లు తెలిపారు.

**గాయపడిన వారి పరిస్థితి**

ఈ ఘటనలో గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆసుపత్రుల్లో వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారి సంఖ్య పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది.వైద్య సిబ్బంది అత్యవసర చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అవసరమైన ఔషధాలు, రక్తం వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

**భద్రతా లోపాలపై విమర్శలు**

ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే విషయం తెలిసినా సరైన భద్రతా చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. జనసందోహాన్ని నియంత్రించేందుకు తగిన సిబ్బంది లేకపోవడం ప్రమాదానికి కారణమైందని అంటున్నారు. భక్తులకు మార్గదర్శకాలు ఇవ్వడంలో కూడా నిర్వాహకులు విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు సరైన ప్రణాళిక లేకపోవడం కూడా సమస్యను మరింత పెంచిందని స్థానికులు చెబుతున్నారు.

**ప్రత్యక్ష సాక్షుల వర్ణనలు**

ఘటన సమయంలో అక్కడ ఉన్న భక్తులు భయానక పరిస్థితిని వివరించారు. పాట్నా నుంచి వచ్చిన ఒక భక్తురాలు మాట్లాడుతూ, ఆలయం వద్ద ఎప్పుడూ రద్దీ ఉంటుందని, కానీ ఈసారి పరిస్థితి మరింత దారుణంగా మారిందని చెప్పారు. ఒక్కసారిగా జనం ఒకరిపై ఒకరు పడిపోవడంతో తాము భయాందోళనకు గురయ్యామని తెలిపారు.మరో భక్తురాలు మాట్లాడుతూ, తాము కలిసి వచ్చినవారితో విడిపోయామని, పరిస్థితి పూర్తిగా అదుపుతప్పిందని పేర్కొన్నారు. జనం గందరగోళంలో పడిపోవడంతో బయటకు రావడం కూడా కష్టమైందని చెప్పారు.ఆసుపత్రి వద్ద ఉన్న ఒక వ్యక్తి మాట్లాడుతూ, ఆలయం లోపలికి వెళ్లడానికి కూడా స్థలం లేకపోయిందని తెలిపారు. అంబులెన్స్ ఆలస్యంగా చేరుకోవడం వల్ల పరిస్థితి మరింత విషమించిందని అన్నారు.



**రాజకీయ నాయకుల స్పందన**

ఈ ఘటనపై రాష్ట్ర నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.బాధిత కుటుంబాలకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా భవిష్యత్తులో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

**ప్రధాని మోదీ సంతాపం**

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది చాలా బాధాకరమైన ఘటన అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

**విచారణకు అవకాశాలు**

ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపే అవకాశం ఉంది. భద్రతా లోపాలు, నిర్వహణలో జరిగిన తప్పిదాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**భవిష్యత్తుకు పాఠాలు**

ఈ ఘటన మరోసారి భారీ జనసందోహం నిర్వహణలో జాగ్రత్తలు ఎంత ముఖ్యమో గుర్తుచేసింది. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక రోజుల్లో ఆలయాల వద్ద భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.నలందలో జరిగిన ఈ దుర్ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. ఒక పుణ్యక్షేత్రంలో జరిగిన ఈ ఘటన అనేక కుటుంబాలను దుఃఖంలో ముంచేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృథా చేశారన్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు ఫైనాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృథా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆరఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, డిడి9 వార్తలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదని హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప



ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పింది. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టాడు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా అని అన్నారు. సీఆర్ పాటిల్ ఒకసారి తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను అడిగితే, నీళ్లు ఎప్పుడు వచ్చాయి, ఎలా వచ్చాయని స్పష్టంగా తెలుస్తుందన్నారు. కేవలం బీఆరఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రూ.50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేదని అన్నారు. మీకు మా మీద కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్ వెంటే ఉండాలని మహిపాల్ రెడ్డి డిసైడ్ అయ్యారా?

**మొదటిపేజీ తరువాయి**

ఏం జరిగింది? ఆయనే గుడ్ బై చెప్పారా..చెప్పాల్సి వచ్చిందా?

పటాన్‌చెరు MLA మహిపాల్ రెడ్డి వ్యవహార శైలి మళ్ళీ చర్చకి వచ్చింది. ఇన్నాళ్లూ దాగుడు మూతలు ఆడినా...అసెంబ్లీలో ఆయన వ్యవహారంతో దాదాపు ఓ క్లారిటీ వచ్చేసింది. అక్రమ మైనింగ్ మాఫియాపై సభలో రెండో రోజు చర్చ జరుగుతున్న క్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బిఆర్ఎస్ సభ్యులకు మద్దతుగా నిలబడ్డారు. పొంగులేటికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో ఎమ్మెల్యే కూడా పాల్గొన్నారు. దీంతో ఎమ్మెల్యే ఇక బీఆర్ఎస్ వెంటే ఉండాలని డిసైడ్ అయ్యారా...సభలోనే క్లారిటీ ఇచ్చారా అనే చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆయన ఇలాంటి చర్చకు అవకాశం ఇవ్వలేదు. కానీ సభలో మైనింగ్ ఎపిసోడ్ పై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన బీఆర్ఎస్ సభ్యులకు మద్దతుగా నిలబడ్డారు.

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వ్యవహారం ఎలా ఉన్నా... సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై స్పందించారు. తన ఎమ్మెల్యే సోదరుడి మైనింగ్‌ను కాపాడే ప్రయత్నంలో హరీష్ ఉన్నారని...అందుకు రెవెన్యూ మంత్రి సహకరించకపోవడంతో ఇలాంటి ఆందోళనలు చేస్తున్నారంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే సోదరుడిని ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. ప్రభుత్వం వేసిన సీబీసీఐడీ విచారణలో ఆ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరును కూడా చేర్చారు. దీంతో ఇటు ప్రభుత్వం కూడా మహిపాల్ రెడ్డిని తన ఖాతాలో వేసుకోవడం లేదనే క్లారిటీ వచ్చింది.

ఇప్పటికే పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల మధ్య పోటీ తీవ్రంగా వుంది. పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నీలం మధు ఓవైపు... పటాన్‌చెరు ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ మరోవైపు యాక్టివ్‌గా వున్నారు. అయితే ఈ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఎలా ఉన్నా...ప్రస్తుతం జరుగుతున్న ఎపిసోడ్‌లో కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని వదిలేసుకున్నట్టేనన్న చర్చ సాగుతోంది. జిహెచ్‌ఎంసి ఎన్నికలు కూడా సమీపిస్తున్నాయన్న డిస్కషన్ జరుగుతున్న క్రమంలో ఆ నియోజకవర్గంలోని సుమారు 9 డివిజన్లో ఉన్నాయి. వీటిని కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటివరకు ఆ నియోజకవర్గంలో మహిపాల్ రెడ్డిదే పైచేయిగా అధికారుల వ్యవహారం సాగింది. కానీ మైనింగ్ అక్రమ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరితో మహిపాల్ రెడ్డిని కాంగ్రెస్ సొంతం చేసుకునే పరిస్థితిలో కూడా లేదు. మరోవైపు గత ప్రభుత్వంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై హరీష్ రావు ఎందుకు స్పందించలేదని పటాన్‌చెరు ఇన్చార్జి కాటా శ్రీనివాస్ మాటలదాడిని మొదలుపెట్టారు. ఇలా పటాన్‌చెరు రాజకీయం రంజుగా మారుతోంది. ఓవైపు మెదక్ పార్లమెంటు నియోజకవర్గం ఇన్చార్జి నీలం మధు... మరోవైపు పటాన్ చెరు ఇంచార్జి కాటా శ్రీనివాస్ మధ్య కాంగ్రెస్‌లో మళ్ళీ పోటీ మొదలుకానుందన్న మాటలూ షురూ అయ్యాయి.



## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

- **నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు**
- **విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కటీ భేటీ**
- **24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కటీ**
- **డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్ లైన్ లో మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి చేస్తామని చెప్పారు. అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ నిర్వాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్‌తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ



జన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న సబ్ కటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌత, అధికారులు కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచఎంసీ కమీషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.




# కినార్ పల్లిలో పౌర హక్కుల దినోత్సవం.

**బజార్హత్నూర్, మార్చి 31:(డిడి 9వార్త న్యూస్ )**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం కినార్పల్లిగ్రామపంచాయతీ కేంద్రం లో మంగళవారం రోజు పౌర హక్కుల దినోత్సవం జరిపారు పౌర హక్కుల విషయం పై ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి పౌరుల హక్కులపై పూర్తి అవగాహనా కల్పించారు.ఈ కార్యక్రమంలోఆదిలాబాద్ జిల్లా డివిఎంసిజంగుబాపు,రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాథోడ్ నూర్ సింగ్, ఎస్ సి హాస్టల్ అధికారి ఎం. చైతన్య, కినార్ పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ నాజీమ్, సర్పంచ్ సూర్య వంశీ నిషాతాయి, ఉప సర్పంచ్ కేశవ్, మాజీ సర్పంచ్ సచిన్,వార్డు సభ్యులుఅంకుష్,అనిల్, ఆత్మరామ్,గ్రామ పెద్ద సూర్య వంశీ చంద్ర కాంత్, పలువురు మహిళలు పురుషులు తదితరులు పాల్గొన్నారు.




# హోటళ్లు బంద్.. తిరుమల అన్నదాన సత్రంపై ఒత్తిడి

**తిరుపతి :-**

తిరుమలలో గ్యాస్ కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది. సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో కొండపైన 50కి పైగా హోటళ్లు మూతపడ్డాయి. దీంతో భక్తులంతా టీటీడీ నిర్వహిస్తున్న ఉచిత అన్నప్రసాదంపై ఆధారపడుతున్నారు. గత నెలతో పోలిస్తే ఈ నెల అదనంగా లక్ష మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్లు సమాచారం. రోజుకు సుమారు 6 టన్నుల గ్యాస్ను వాడుతున్నా, హోటళ్ల మూసివేతతో అన్నదాన సత్రాలపై ఒత్తిడి గణనీయంగా పెరిగినట్టు తెలుస్తోంది.





## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా

# వర్గంటి రామ్మోహన్ గౌడ్..

- రాష్ట్ర కమిటీలో జిల్లా లో ఒక్కరికే అవకాశం

**తూప్రాన్ మార్చ్ 31 (డిడి9 వార్త)**

తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గంలో మెదక్ జిల్లా నుండి ఏకైక నాయకుడైన వర్గంటి రామ్మోహన్ గౌడ్ కు అవకాశం ఇవ్వడం పట్ల రాష్ట్ర బిజెపి అధ్యక్షులకు రామచంద్ర రావు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడి గా పని చేయడంతో గుర్తించి నాకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లా నుండి నాకు అవకాశం ఇవ్వడం నా పై మరింత బాధ్యత పెంచిందని పార్టీ బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వర్గంటి రామ్మోహన్ గౌడ్ తెలిపారు తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీలో కీలక నియామకం చోటుచేసుకుంది. సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో జిల్లాలో బిజెపి శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వర్గాంటి రాంమోహన్ గౌడ్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్ , సీనియర్ నాయకులు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. “మీ ప్రేమే నా బలం – మీతో ఈ బంధమే నా ఊపిరి. మీ అందరి ఆశీస్సులతో మరింత బాధ్యతగా, శక్తివంతంగా పనిచేస్తాను. జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను” అని ఆయన స్పష్టం చేశారు.

ఈ నియామకం ద్వారా మెదక్ జిల్లాలో బిజెపి పార్టీకి కొత్త ఊపు లభిస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సెమీకండక్టర్ రంగంలో దూసుకెళ్తున్న భారత్

- **సెమీకండక్టర్ రంగంలో దూసుకెళ్తున్న భారత్**
- **సనంద్‌లో కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ**
- **స్వయం సమృద్ధి లక్ష్యంతో సెమీకండక్టర్ మిషన్‌కు ఊతం**
- **గుజరాత్ సనంద్‌లో రూ.3,300 కోట్లతో ఆధునిక ప్లాంట్ ప్రారంభం**
- **ప్రపంచ సరఫరా గొలుసులో బలపడుతున్న భారత్ స్థానం**
- **రోజుకు లక్షల సంఖ్యలో చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యం**
- **ఎలక్ట్రిక్ వాహనాలు, పరిశ్రమలకు కీలకమైన ఐపీఎంల తయారీ**
- **మహావీర్ జయంతి సందర్భంగా సమ్రాట్ సంప్రతి మ్యూజియం ఆవిష్కరణ**
- **మైక్రాన్ ప్రాజెక్ట్ వేగం ఉదాహరణగా ప్రధాని వ్యాఖ్యలు**

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

దేశాన్ని అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీ రంగంలో భారత్ తన సామర్థ్యాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని సనంద్‌లో నిర్మించిన ఆధునిక సెమీకండక్టర్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలను వెల్లడించారు.

**స్వావలంబన దిశగా అడుగులు**

దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా విదేశాలపై ఆధారాన్ని తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని తెలిపారు. గత బడ్జెట్‌లో భాగంగా సెమీకండక్టర్ మిషన్ రెండో దశను ప్రారంభించామని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ద్వారా భారత్‌లో చిప్ తయారీ పరిశ్రమను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సెమీకండక్టర్ రంగం అత్యంత కీలకమైందని ఆయన పేర్కొన్నారు. ఈ రంగంలో భారతీయ సంస్థలు కూడా తమ ముద్ర వేయడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో భారత్ విశ్వసనీయ సరఫరాదారుగా ఎదుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**కొత్త ప్లాంట్‌తో పెరుగుతున్న సామర్థ్యం**

సనంద్‌లో ప్రారంభమైన ఈ కొత్త సెమీకండక్టర్ ప్లాంట్ దేశానికి మరో పెద్ద మైలురాయిగా భావిస్తున్నారు. సుమారు రూ.3,300 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్ నిర్మించబడింది. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభించిన తర్వాత భారీ స్థాయిలో ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉంటుంది.ఈ ప్లాంట్ ద్వారా రోజుకు సుమారు 63 లక్షలకుపైగా చిప్ యూనిట్లు తయారయ్యే అవకాశం ఉంది. ఇది దేశీయ అవసరాలను తీర్చడమే కాకుండా ఎగుమతులకు కూడా దోహదపడనుంది. చిప్ తయారీ రంగంలో భారత్ స్వావలంబన సాధించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిపుణులు భావిస్తున్నారు.

**ఐపీఎంల తయారీలో ప్రత్యేకత**

ఈ ప్లాంట్‌లో ప్రధానంగా అడ్వాన్స్‌డ్ ఇంటెలిజెంట్ పవర్ మాడ్యూల్స్ (IPMs) తయారు చేయనున్నారు. ఇవి విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పరిశ్రమల మోటార్ డ్రైవ్‌లు, గృహోపకరణాలలో ఇవి విస్తృతంగా ఉపయోగపడతాయి.పవర్ స్విచింగ్ టెక్నాలజీలో ఈ చిప్‌లు కీలకమైన భాగం. తక్కువ స్థలంలో ఎక్కువ సామర్థ్యంతో పనిచేసే ఈ ఉత్పత్తులు ఆటోమోటివ్ మరియు పారిశ్రామిక రంగాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఈ ప్లాంట్ ద్వారా దేశీయ పరిశ్రమలకు నాణ్యమైన చిప్‌లు అందుబాటులోకి రానున్నాయి.

**ప్రపంచ మార్కెట్‌లో భారత్ స్థానం**

ప్రపంచ సెమీకండక్టర్ సరఫరా గొలుసులో భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశాలు ఈ ప్రాజెక్ట్‌తో పెరిగాయని ప్రధాని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో




గ్లోబల్ సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అంతరాయాలు భారత్‌కు ఒక పాఠంగా మారాయని ఆయన పేర్కొన్నారు.అప్పటి నుంచి దేశం ఈ రంగంలో స్వతంత్రంగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని చెప్పారు. 2021లో ప్రారంభించిన సెమీకండక్టర్ మిషన్ ఈ దిశగా కీలక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. ఇది కేవలం పరిశ్రమల అభివృద్ధి మాత్రమే కాకుండా దేశ ఆత్మవిశ్వాసానికి కూడా ప్రతీక అని పేర్కొన్నారు.

**మ్యూజియం ఆవిష్కరణతో సాంస్కృతిక సందేశం**

ఇదే కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లోని కోబా గ్రామంలో నిర్మించిన సమ్రాట్ సంప్రతి మ్యూజియాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. మహావీర్ జయంతి సందర్భంగా ఈ మ్యూజియం ఆవిష్కరణ జరగడం విశేషం. జైన మత సంప్రదాయాలను, అహింసా సిద్ధాంతాన్ని ప్రతిబింబించేలా దీనిని రూపొందించారు.ఈ మ్యూజియంలో ప్రాచీన భారతదేశానికి చెందిన వేలాది కళాఖండాలు ప్రదర్శనలో ఉంచారు. రాతి, లోహ విగ్రహాలు, పురాతన లిఖిత పత్రాలు, నాణేలు వంటి అనేక అరుదైన వస్తువులు ఇందులో ఉన్నాయి. ఆధునిక ఆడియోవిజువల్ సాంకేతికతతో సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని కలిగించేలా ఏర్పాటు చేశారు.ప్రధాని ఈ మ్యూజియాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. జైన మత గురువులతో కూడా మాట్లాడారు. భారత సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం కూడా సమానంగా ముఖ్యమని ఆయన అన్నారు.

**మైక్రాన్ ప్రాజెక్ట్ వేగంపై ప్రస్తావన**

ఈ సందర్భంగా గతంలో ప్రారంభించిన మైక్రాన్ సెమీకండక్టర్ ప్రాజెక్ట్‌ను కూడా ప్రధాని ప్రస్తావించారు. ఆ ప్రాజెక్ట్ అమలు వేగం దేశ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్ట్‌లు పూర్తి కావడానికి అనేక సంవత్సరాలు పడుతాయని, కానీ భారత్ తక్కువ సమయంలోనే పూర్తి చేసిందని అన్నారు. ప్రణాళికలు స్పష్టంగా ఉండటం, అమలు పట్ల నిబద్ధత ఉండటం వల్లే ఇది సాధ్యమైందని ఆయన వివరించారు. దేశ అభివృద్ధి వేగాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

**అభివృద్ధి దిశగా ముందడుగు**

సెమీకండక్టర్ రంగంలో ఈ కొత్త పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపనున్నాయి. ఉద్యోగ అవకాశాలు పెరగడం, కొత్త సాంకేతికతలు అభివృద్ధి చెందడం, పరిశ్రమల వృద్ధి వంటి అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. ప్రపంచ మార్కెట్లో పోటీ పడే స్థాయికి భారత్ చేరుకునే దిశగా ఈ చర్యలు కీలకంగా మారుతున్నాయి. రాబోయే సంవత్సరాల్లో మరిన్ని ప్రాజెక్ట్‌లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. సనంద్‌లో ప్రారంభమైన ఈ సెమీకండక్టర్ ప్లాంట్ దేశానికి మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. స్వయం సమృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్న భారత్, సాంకేతిక రంగంలో కూడా తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోంది. ఈ ప్రాజెక్ట్‌లు విజయవంతమైతే, భారతదేశం ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో ఒక ప్రధాన శక్తిగా ఎదగడం ఖాయం అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనను విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.

**కేసు వివరాలు**

జనవరి 29న జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఈ వివాదం చోటుచేసుకుంది. జాతర ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకోవడం, రహదారిపై గుమిగూడడం వంటి ఆరోపణలు నమోదు అయ్యాయి. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసును ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసింది. కేసు ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని లోతైన దర్యాప్తు జరిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**సీఐడీ దర్యాప్తు ప్రారంభం**

కేసు తమకు బదిలీ అయిన వెంటనే సీఐడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా సాక్ష్యాలను సేకరించడం, వీడియోలను పరిశీలించడం, సంబంధిత వ్యక్తులను గుర్తించడం వంటి చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. బీఎన్ఎస్ఎస్ చట్టంలోని సెక్షన్ 35(3) ప్రకారం ఈ నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

**విచారణకు హాజరు కావాలని ఆదేశం**

సీఐడీ ఇచ్చిన నోటీసుల ప్రకారం, ఎమ్మెల్యే ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో హాజరుకావాలి. ఉదయం 11.30 గంటలకు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేశారు. ఈ విచారణలో ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించడంతో పాటు, ఆయన పాత్రపై స్పష్టత తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

**ఆరోపణల వివరాలు**

జాతర సమయంలో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమికూడిన సందర్భంలో, ఎమ్మెల్యే కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ సమయంలో రహదారిపై గుమిగూడడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని పోలీసులు పేర్కొన్నారు. అదేవిధంగా విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకోవడం, వారి పనితీరులో జోక్యం చేసుకోవడం వంటి ఆరోపణలు ఉన్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

**అధికారులపై వ్యాఖ్యలు**

ఈ ఘటనలో పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఉన్నతాధికారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు కేసులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయని అధికారులు భావిస్తున్నారు. ప్రజల్లో అపోహలు కలిగేలా మాట్లాడారని కూడా ఆరోపణలు ఉన్నాయి.

**సోషల్ మీడియా వీడియోలు కీలకం**

ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందాయి. ఈ వీడియోలు ప్రస్తుతం దర్యాప్తులో కీలక ఆధారాలుగా మారాయి. వీడియోల్లో కనిపించిన దృశ్యాలను పరిశీలిస్తూ సీఐడీ అధికారులు ఘటన క్రమాన్ని విశ్లేషిస్తున్నారు. వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**సహకరించకపోతే చర్యలు**

సీఐడీ అధికారులు జారీ చేసిన నోటీసుల్లో స్పష్టమైన హెచ్చరికలు కూడా ఉన్నాయి. విచారణకు తప్పకుండా హాజరుకావాలని, దర్యాప్తుకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. అలా చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

**రాజకీయంగా చర్చ**

ఈ ఘటన ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కూడా చర్చకు దారితీసింది. జాతర వంటి భారీ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఇలాంటి సంఘటనలు జరగడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమ్మక్కసారలమ్మ జాతరలో జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. సీఐడీ విచారణలో ఏమి తేలుతుందో అన్నది ఆసక్తిగా మారింది. ఈ కేసు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

## మహారాష్ట్ర మాజీ సీఎం ఏక్నాథ్ షిండే పుత్రుడు మహా రాష్ట్ర ఎంపీ అయిన శ్రీ కాంత్ షిందేతో ఎంపీ నగేష్ భేటీ.

**బజార్ హత్నూర్ ,మార్చి, 31 (డిడి 9వార్త న్యూస్ ):-**

దేశ రాజధాని ఢిల్లీలోమహారాష్ట్రమాజీముఖ్యమంత్రి ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిందే తనయుడు శ్రీకాంత్ షిందే మహారాష్ట్ర పార్లమెంట్ సభ్యులుతో తెలంగాణ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మంగళవారం రోజు మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా ఎంపి నగేష్ తన నియోజకవర్గం ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మహారాష్ట్ర సరిహద్దు పెన్ గంగా నది గట్టు గ్రామం అయిన వడూర్ వద్ద నది పై ఒక భారీ వంతెన నిర్మాణం అవసరం కోసమై చర్చించారు. ఈ విషయముపై శ్రీకాంత్ మహారాష్ట్ర అధికారులతో మాట్లాడి అక్కడి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు ఎంపి నగేష్ తెలిపారు. ఎంపీతో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటి పెల్లి గంగాధర్ రావు ఉన్నారు.



# మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' పథకం భరోసా

• -జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి : 31 (డి డి 9వార్త ప్రతినిధి )**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ పథకం ప్రారంభం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా వారు సుమారు 10,000 కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం కింద సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, బస్సు కిరాయి రూపంలో ఆదిలాబాద్ డిపో 106 కోట్లు, ఉట్నూరు డిపో 28 కోట్ల రూపాయలకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, త్వరలోనే ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని ప్రకటించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, పి.హెచ్.సి కేంద్రాల ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టును మొదలుపెడతామని తెలిపారు. అలాగే, మహిళలు బస్సుల్లో ప్రయాణించడమే కాకుండా, స్వయంగా బస్సులను నడిపేలా జిల్లా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులను కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. పథకం



ద్వారా ఆదా అయిన సొమ్మును మహిళలు తమ కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మహిళ, ట్రాన్స్ జెండర్ ప్రయాణికులను, ఉద్యోగులను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పిడి రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిఎం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ, ఇతర శాఖల మహిళ ఉద్యోగులు, మహిళా ప్రయాణికులు, ట్రాన్స్ జెండర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యం పి హెచ్ సి లో టీకా పంపని

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 31 (డి డి వార్త ):-**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇచ్చే హెచ్.పి.వి వ్యాక్సినేషన్ ప్రక్రియ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దాం పర్యవేక్షించారు. మొదటి రోజు ఇద్దరు లబ్ధిదారులకు ఈ టీకాను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సద్దాం మాట్లాడుతూ.. బాలికల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ వ్యాక్సిన్ ఎంతో దోహదపడుతుందని, అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ( హెచ్ ఈ ఓ) పవార్ రవీందర్, హెల్త్ సూపర్వైజర్ సంతోష్, ఏ.ఎన్.ఎం అమ్మిబాయి, మరియు ఆరోగ్య సహాయకులు అందరూ పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట: రూ. 158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు.

**ఆదిలాబాద్, మార్చి,31 :( డిడి 9వార్త ప్రతినిధి )**

ఆదిలాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని పురపాలక సంఘం అధ్యక్షులు బండారి అనూషతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తం రూ. 157.97 కోట్లతో (సుమారు రూ. 158 కోట్లు) అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడంజరిగిందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాలపరిమితిని మరో ఏడాది పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న మురికి కాలువలు, మంచినీటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రీన్ బడ్జెట్ కింద పురపాలక చట్టం ప్రకారం 10% నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించిన్నట్లు తెలిపారు.ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించి, వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి




సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. పురపాలక సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ, వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నల్లా పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ రోహిత్, వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డెడ్రాలో రూపాయలు 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు ఆరంభం.

**బజార్ హత్నూర్, మార్చి 31 (డిడి 9వార్త న్యూస్ ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం లోని డెడ్రా గ్రామములో పార్లమెంట్ సభ్యులు జి నగేష్ కృషి ఫలితంగా రూపాయలు 10,000,00 ల నిధులతో మంజూరైనా సీసీ రోడ్డును మంగళవారం భూమి పూజ చేసి ఆరంభం చేశారు.ఈ కార్యక్రమం లోస్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, బిజెపి మండల అధ్యక్షులు,గ్రామ పెద్దలు కార్యకర్తలు పాల్గొన్నారు






## నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఐదుగురు సిబ్బందికి ఘనంగా వీడ్కోలు

**నిజామాబాద్ జిల్లా 31 మార్చి (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పదవీ విరమణ చేసిన ఐదుగురు సిబ్బందికి అత్యంత ఘనంగా వీడ్కోలు పలికారు. సుదీర్ఘ కాలం పాటు శాఖకు విశిష్ట సేవలు అందించిన ఎస్టాబ్లిష్మెంట్ సూపరిండెంట్ పి. శ్రీనివాస్, సి.సి.ఎస్ ఇన్స్పెక్టర్ పి. రవీందర్, ఎస్సై టి. శ్యాం కుమార్, ఎ.ఎస్.ఐ ఆర్. గంగారాం మరియు హెడ్ కానిస్టేబుల్ డి. ప్రభాకర్ తమ విధులను విజయవంతంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ సర్టిఫికేట్లు, జ్ఞాపికలను అందజేశారు. పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడి ఉన్నప్పటికీ ఎటువంటి రిమార్కు లేకుండా ఇంతకాలం సేవలు అందించడం ఎంతో గొప్ప విషయమని, ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది సహజమని ఆయన పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించిన కమిషనర్, వారికి భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీ.సీ.పీ బస్వా రెడ్డి, పలువురు కార్యాలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొని వీడ్కోలు పలికారు.




## పౌర హక్కుల అవగాహన దినోత్సవం

**నిజామాబాద్ పోతంగల్ మార్చి 31(డిడి9వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పోతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు ఆధ్వర్యంలో మంగళవారం రోజున పౌర హక్కుల అవగాహన దినోత్సవం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎస్సీ హాస్టల్ వార్డెన్ నరహరి మాట్లాడుతూ పిల్లలను తప్పకుండా చదివించాలి ఇతరులకు చెడు వ్యక్తిగా కాకుండా మంచి విద్యను అందించాలి పిల్లలకు 5 తరగతి నుండి 10 తరగతి వరకు స్కాలర్షిప్ ఎస్సీ అబ్బాయి గాని అమ్మాయి గాని బిసి అమ్మాయి గాని అబ్బాయికి గాని వివాహం చేసుకుంటే ప్రభుత్వం 2.12 లక్షల రూపాయలు ఇస్తుంది ఈ కార్యక్రమం ప్రతినెల మండల కేంద్రంలోని ఒక గ్రామంలో పెట్టడం జరుగుతుంది కులాలకు మతాలకు అతీతంగా అంటరానితనం ముట్టుడు అంటుడు అనేదానికి ప్రభుత్వం కొన్ని చట్టాలను తీసుకువచ్చింది ఆ చట్టాలలో మనం కూడా భాగస్వామ్యం కావాలి నిర్వీర్యం కావాలి జనజీవనంలో కలవాలి మనిషి మనిషిగా బ్రతకాలి ఆ రూపకల్పన భాగంగానే పౌరహక్కుల అవగాహన దినోత్సవం జరుపుకుంటున్నారు ఎస్సీ ఎస్టీ పైన చాలా రకమైన దాడులు ముట్టుడు అంటుండు అన్నవారికి బాబా సాహెబ్ అంబే




ద్కర్ చేసిన కృషి పట్ల అటువంటి విషయాలు ఏవైనా ఉంటే మా దృష్టికి తీసుకురాండి అటువంటి వారిపై చట్టపురమైన చర్యలు తీసుకుంటాము చదువుతో ఉద్యోగం వస్తుందని కాదు గాని మనం సమాజంలో ఏ విధంగా ఉండాలి అని అనుభవం వస్తుంది ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నరహరి ఆర్ ఐ గౌస్ ,తాసిల్దార్ అబ్దుల్ అజీజ్ ,భూమయ్య ,సాయిలు ,సాయిరాం ,పోశెట్టి ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్

**నిజామాబాద్ జిల్లా 31 మార్చి (డీడీ9 వార్త) :**

హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం మద్యం దుకాణాలను మూసివేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ ఉదయం 6 గంటల వరకు వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలు, క్లబ్బులు మూసి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలులో ఉంటాయని, ఆదేశాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## నిబద్ధతకు నిదర్శనం శ్యామ్ కుమార్ సేవలు

**నిజామాబాద్ జిల్లా 31 మార్చి (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా కోర్టు లైజన్ ఆఫీసర్ టి.శ్యామ్ కుమార్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, లీగల్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ రోజు తన వృత్తి బాధ్యతల నుండి పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ శ్యామ్ కుమార్ తన విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో పనిచేశారని, ఆయన వ్యక్తిగత నడవడిక అందరికీ ఆదర్శప్రాయమని ప్రశంసించారు. అనంతరం శ్యామ్ కుమార్ మాట్లాడుతూ... తన సర్వీసులో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీపీ రాజేశ్వర్ రెడ్డి, పోక్సో స్పెషల్ పీపీ రాజారెడ్డి, అడిషనల్ పీపీలు దయాకర్, వసంత్, నీరజ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నీలా కాంతారావు పాల్గొన్నారు. అలాగే చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజకుమార్ సుబేధర్, నూతన లైజన్ ఆఫీసర్ ఎస్ఐ గోవింద్, అసిస్టెంట్ లైజన్ ఆఫీసర్ టీఎల్ఎన్ స్వామి తదితరులు పాల్గొని శ్యామ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టిగా కృషి చేద్దాం: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా 31 మార్చి (డీడీ9 వార్త) :**

జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గుర్తించిన 55 బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా సాయంత్రం 5 గంటల తర్వాత ఇసుక లోడుతో వెళ్లే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. వరి కోతల సమయంలో ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా చైతన్యపరచాలని, నిజామాబాద్ జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి అధికారి భాగస్వామి కావాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఈఓ అశోక్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## గ్రామసభల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలి: మండల ప్రత్యేక అధికారి పద్మజ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 31 మార్చి (డీడీ9 వార్త) :**

సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా సంక్షేమ అధికారిణి పద్మజ అధ్యక్షతన మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశం మంగళవారం జరిగింది. ఏప్రిల్ 2వ తేదీన మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామసభల ఏర్పాట్లపై ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామసభలు విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు ముందస్తు సమాచారం అందించి వారు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల ప్రణాళికల రూపకల్పనలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని, అందుకే ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని పద్మజ స్పష్టం చేశారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలను అధికారులు వివరించగా, నిర్దేశించిన సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి పద్మజ ఆదేశించారు. ప్రతి గ్రామంలో పారదర్శకంగా సభలు నిర్వహించి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారి, మండల పంచాయతీ అధికారి, మండల విద్యాధికారిలతో పాటు ఐసీడీఎస్ సూపర్వైజర్, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈ, విద్యుత్ శాఖ ఏఈ, ఐకేపీ ఏపీఎం, హౌసింగ్ ఏఈ మరియు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## సాలూర నర్సరీని సందర్శించిన ఎంపీడీఓ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 31 మార్చి (డీడీ9 వార్త) :**

సాలూర మండల కేంద్రంలోని నర్సరీని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించి మొక్కల పెంపకం తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. నర్సరీలో పెరుగుతున్న వివిధ రకాల మొక్కల నాణ్యతను తనిఖీ చేసిన ఎంపీడీఓ, ఎండ తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా నిత్యం నీటిని అందిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రాబోయే వర్షాకాలం నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు నాణ్యమైన మొక్కలను సిద్ధం చేయాలని, క్షేత్రస్థాయిలో పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను ఆదేశించారు. నర్సరీ రికార్డులను, స్టాక్ రిజిస్టర్లను నిశితంగా పరిశీలించిన ఎంపీడీఓ, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో నర్సరీ పనులకు సంబంధించిన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పనుల వేగం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రీతి, సాలూర ఫీల్డ్ అసిస్టెంట్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.







# పిప్రిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగసభ స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ శ్రేణులు

**బజార్హత్నూర్, మార్చి, 31:(డిడి 9వార్త న్యూస్ ):**

బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్, జిల్లా అధ్యక్షులు నరేష్ జాదవ్ అధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సభ స్థాలాన్ని మంగళవారం రోజు పరిశీలన చేశారు. ఏప్రిల్ 6వ తేదీన పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు 3 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు వస్తున్నందున స్థలాన్ని ఈ రోజు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్,జిల్లాగ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మల్లెపూల నర్సయ్య,ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్,నాయకులు అశ్విన్ రెడ్డి,బజార్ హత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెల్కే పాండురంగ్లతో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ లు పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# తూప్రాన్ చెరువుకట్ట వీరాంజనేయ స్వామి జయంతి ఆలయం లో పూజా హనుమాన్ జయంతి

- **ఉత్సవాలు ఘనంగా ప్రారంభం**
- **తరలివస్తున్న వేలాది భక్తులు**
- **జైశ్రీరామ్ జై హనుమాన్ అంటూ భక్తుల నినాదాలు**

**తూప్రాన్ మార్చ్ 31 (డీడీ9 వార్త )**


మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని చెరువుకట్టపై ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తి వాతావరణంతో కళకళలాడుతోంది. స్వయం భువుగా వెలసిన ఈ పవిత్ర క్షేత్రం, ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా వైభవంగా ఉత్సవాలను మంగళవారం రోజున పరభావ నమ సంవత్సరం చైత్ర శుద్ధ చతుర్దశి రోజున గణపతి పూజ, పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన , అంకురార్పణం, గురు చరిత్ర పారాయణము , సుందరకాండ , మన్యు పాశుపదం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలతో మూడు రోజుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఆలయ పురోహితులు శ్రీ శలాక ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో ఆలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ఆధ్యాత్మిక కాంతిని విరజిమ్మేలా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు దర్శనార్థం పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయం పరిసరాలు ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయాయి.భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన కార్యక్రమాలు

హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఆలయ పురోహితులు హనుమాన్ మలదరణ గురుస్వామి సలాక ఆత్రేయ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. మాలధారణ స్వాములు కలిసి హనుమాన్ చాలీసా పారాయణం దండక పఠనం నిరంతర నామస్మరణ రామకోటి కార్యక్రమాలు శ్రీ సీతారాముల, హనుమాన్ భజనలు భక్తి పరవశంతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా "జై శ్రీరామ్", "జై హనుమాన్" నినాదాలతో మార్మోగింది.

ఈ ఉత్సవాల్లో భాగంగా తూప్రాన్ వాస్తవ్యులు ఆలయ పురోహితులు గురు స్వామి ఆత్రేయ శర్మ సమక్షంలో హనుమాన్ మాలధారణ స్వాములకు మరియు భక్తులకు మహా అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరిస్తారు. ఈ సందర్భంగా గురుస్వాములు సలాక ఆత్రేయ శర్మ మాట్లాడుతూ తూప్రాన్ చెరువు కట్ట హనుమాన్ పిలుస్తే పలికే కొంగు బంగారం అని పూజారి అన్నారు హనుమాన్ మాల ధారణ స్వాములకు ఆ భగవంతుడు కష్టాల నుండి కాపాడి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఈ ఆలయంలో మూడు రోజుల ఉత్సవాలు ఘనంగా పూజలు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణం , సుందరకాండ, గురు చరిత్ర పారాయణం, మన్యు పాశుపదం, తీర్థ ప్రసాద వితరణ, గణపతి, నవగ్రహ, రుద్ర , పంచసూక్త, మన్యుసూక్త, లక్ష్మీ హోమములు, బిక్ష ఇరుముడి, మంగళహారతులు, మంత్ర పుష్పము, గురువారం హనుమాన్ జయంతి రోజున హనుమతు మన్నుపాశుపదం , సింధూరం, లక్ష పత్ర పూజ, లక్ష పుష్పార్చన, గణపతి పంచాయతన దేవాలయంలో ఉన్న అమ్మవారికి ఉడిపియ్యము కుంకుమార్చన శ్రీ శ్రీ శ్రీ యతివార మాధవ నంద సరస్వతి స్వామి వారి పాదపూజ, అనుగ్రహ భూషణ ఉదయము 9 గంటల నుండి 11 గంటల వరకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు తీర్థ ప్రసాద వితరణ , అన్నదానం, మాల విరమణ జరుపబడునని అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది అని అన్నారు. భగవంతుడు ఇచ్చిన వరంగా భావించి ఈ సేవను చేస్తున్నాం" అని తెలిపారు. నీళ్ల దానం, అన్నదానం వంటి పుణ్యకార్యాలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఆలయ విశిష్టత చెరువుకట్టపై వెలసిన ఈ వీరాంజనేయ స్వామి ఆలయం ఎన్నో ఏళ్లుగా భక్తులకు ఆధ్యాత్మిక నిలయంగా నిలుస్తోంది. నిత్య పూజలు, ప్రత్యేక ఉత్సవాలతో ఈ ఆలయం ప్రాంతంలో దివ్య క్షేత్రంగా పేరుగాంచింది. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని స్థానిక ప్రముఖులు హామీ ఇచ్చారు. మార్చి 31వ తేదీ మంగళవారం నుండి ఏప్రిల్ 2వ తేదీ గురువారం వరకు హనుమాన్ జయంతి ఉత్సవాలు, గణపతి పంచాయతన, శ్రీ సత్యనారాయణ స్వామి, శ్రీ శనీశ్వర స్వాముల నవగ్రహ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీ సలాక ఆత్రేయ శర్మ తెలిపారు. ఈ పుణ్య కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులవ్వాలని ఆహ్వానించారు.

పెద్ద చెరువు కట్ట హనుమాన్ గుడి - తూప్రాన్ హనుమాన్ మాలధారణ విరమణ క్షేత్రములో స్వర్గీయ శ్రీ సలాక శ్రీనివాస్ శర్మ ఆశీస్సులతో భక్తి, సేవ, సంప్రదాయం కలిసిన ఈ దివ్య క్షేత్రం హనుమాన్ జయంతి సందర్భంగా మరింత ఆధ్యాత్మిక ప్రకాశాన్ని విరజిమ్ముతోంది. ఆలయ ధర్మకర్త శ్రీ సలాక ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ శృంగేరి పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్యులు భారతి తీర్థమహాస్వామి వారి దివ్య ఆశీస్సులతో, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి దివ్య ఆశీస్సులతో, శ్రీశ్రీ కృష్ణానంద సరస్వతీ స్వామి వారి కరకమలములచే ప్రతిష్టించబడిన గణపతి,పంచాయతన, సత్యనారాయణ స్వామి, శనీశ్వర స్వాముల 28వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవములు ఘనంగా నిర్వహించడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 2వ తేదీ గురువారం ఉదయం హనుమత్ మన్యుపాశుపతం, సింధూరం, లక్షపత్ర పూజ, లక్ష పుష్పార్చన, గణపతి పంచాయతన దేవాలయంలో అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చన, అనంతరం శ్రీశ్రీశ్రీ యతివర మాధవానంద సరస్వతి స్వామి వారి పాదపూజ, అనుగ్రహ భాషణ ప్రవచనం, మరియు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, మాల విరమణ జరుపబడునని ఆలయ ధర్మకర్త గురుస్వామి శ్రీ సలాక ఆత్రేయ శర్మ, తెలిపారు.





# టిపిసిసి ని కలిసిన చైర్ పర్సన్,వైస్ చైర్ పర్సన్,కౌన్సిలర్లు

**భీంగల్ మార్చి 31(డీడీ9 వార్త):**

భీంగల్ మున్సిపల్ చైర్ పర్సన్ బొదిరే నాగమణి స్వామి,వైస్ చైర్ పర్సన్ సంటి లత నర్సయ్య,కౌన్సిలర్లు ఆరేపల్లి శ్రీజ నాగేంద్ర,పర్శ కుశలత అనంతరావ్,తోట సతీష్, అంజుమ్,సందీప్, సంగ్యానాయక్,మాజీ ఎంపీపీ కన్నె సురేందర్ తదితరులు మంగళవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు.పిసిసి అధ్యక్షుల సొంత మండలంలో భీంగల్ మున్సిపాలిటీని కైవాసం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు.భీంగల్ పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అలాగే భీంగల్ మున్సిపల్ నూతన భవనం, ఎమ్మార్వో కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని,చెత్త సేకరణ కొరకు నూతన వాహనాల మంజూరు ఇప్పించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు అని తెలిపారు.



# ఇన్‌స్టా ఫాలో లిస్ట్ దాదాపు క్లియర్ చేసిన రిషబ్ శెట్టి

కొన్ని రోజులుగా నటుడు రిషబ్ శెట్టి పేరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న విషయం తెలిసిందే. తన ఇన్‌స్టాలో తోటి నటీనటులను ఆయన ఇటీవల అన్‌ఫాలో చేయడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. తాజాగా తాను ఫాలో అయ్యే వారందరినీ అన్‌ఫాలో చేశారు. కేవలం తన భార్యను, తన అఫీషియల్ అకౌంట్‌లను మాత్రమే ఆయన ఫాలో అవుతున్నారు. నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్‌ను ఆయన అన్‌ఫాలో చేసినా, ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్‌ను మాత్రం మొన్నటివరకూ రిషబ్ ఫాలో అయ్యారు. తాజాగా ఆయన్ని కూడా అన్‌ఫాలో చేశారు.

మరోవైపు రిషబ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్ జై హనుమాన్' కోసం సిద్ధమవుతున్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన హనుమంతుడి పాత్రలో కనిపిస్తారని ఇప్పటికే ప్రకటించారు. ఇతిహాసంతో కూడిన సూపర్‌హీరో మూవీ 'హనుమాన్'కు 'జైహనుమాన్' సీక్వెల్. ఈ రెండూ 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'లో భాగమే. శ్రీరాముడికి హనుమంతుడు ఇచ్చిన మాట ఏంటి? దాన్ని నిలబెట్టుకోవడానికి ఏం చేశాడు? అన్న నేపథ్యంతో 'జై హనుమాన్' రూపొందుతోంది.



# మిమ్మల్ని మీరు నమ్మడమే మీ సూపర్ పవర్

కెరీర్ ప్రారంభంలో పరిశ్రమలో గుర్తింపు, తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని ఎక్కువగా ఆందోళన పడ్డానని అంటోంది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. వైవిధ్యమైన కథలతో అలరించే తార ఈమె. ప్రస్తుతం 'కాక్‌టెయిల్ 2' సినిమాతో బిజీగా ఉన్న ఈ భామ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కెరీర్ మొదట్లో సవాళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. ''ఈ రంగంలో ప్రతి నటుడు ఒత్తిళ్లను ఎదుర్కొంటాడు. ముఖ్యంగా సినీ నేపథ్యం లేని వారు మరింత ఎక్కువగా ఎదుర్కొంటారు. తొలి నాళ్లలో నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. 'నువ్వు నవ్వినప్పుడు నీ చిగుళ్లు ఎక్కువగా కనిపిస్తాయి'.. ఇలా ఎన్నో మాటలు వింటూ ఉండేదాన్ని. ఇక్కడ మిమ్మల్ని మీరు నమ్మడమే మీ సూపర్ పవర్. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. విమర్శల్ని అధిగమించకపోతే.. మార్పు ఎలా తీసుకురాగలం. అందుకే మనసు మాట వింటూ కష్టపడుతూ పనిచేసుకోవాలి'' అని చెప్పుకొచ్చింది కృతి.



# ఎంతో కష్టపడినా ఫలితం దక్కలేదు..

గ్లామర్‌తోనే కాకుండా తన నటనతోనూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే ఆండ్రియా జెర్మియా ఇప్పుడు ఒక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక నటిగా తన వంతు కష్టపడి షూటింగ్ పూర్తి చేసినప్పటికీ, ఆమె నటించిన రెండు క్రేజీ ప్రాజెక్టులు పిశాచి2, మానుషి విడుదల నోచుకోలేదు. తాజాగా, ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆండ్రియా, తన సినిమాల విడుదల గురించి వస్తున్న ప్రశ్నలకు చాలా ఎమోషనల్‌గా సమాధానమిచ్చారు. ''ఆ రెండు చిత్రాల కోసం మీలాగే నేను కూడా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. కానీ అవి ఎప్పుడు థియేటర్లలోకి వస్తాయో నాకే తెలియదు. షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రాలకు నిర్మాత పరమైన సమస్యలు అడ్డుగా మారాయి.ఎవరో ఒకరు పెద్ద మనసు చేసుకుని ముందుకు వచ్చి, ఆ సినిమాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలి. ఎంతో కష్టపడి చేసినా ఫలితం దక్కడం లేదు. అదే నాకు బాధగా ఉంది" అని చెప్పుకొచ్చింది. ఒక నటిగా తన వంతు పని పూర్తి చేశానని, ఇప్పుడు అంతా నిర్మాతలు, బయ్యర్ల చేతుల్లోనే ఉందని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా మిస్కిన్ దర్శకత్వంలో రూపొందిన 'పిశాచి2'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి, కానీ ఆర్థిక చిక్కుల వల్ల అది వాయిదా పడుతూ వస్తోంది. ఆగిపోయిన రెండు సినిమాలను కూడా ఏదో ఒక ఓటీటీ సంస్థ అయినా కొనుగోలు చేసి విడుదల చేస్తే బాగుంటుందని నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. అయితే, ఈ నిరాశలో ఉన్న ఆండ్రియా అభిమానులకు ఒక క్రేజీ అప్‌డేట్ కూడా అందింది. స్టార్ హీరో శింబు సరసన 'అరసన్' అనే భారీ చిత్రంలో ఆమె నటించబోతున్నారు. వెట్రిమారన్ దర్శకత్వంలో రాబోతుండగా..కలైపులి ఎస్. థాను నిర్మిస్తుండగా, అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం 'వడచెన్నై'కి సీక్వెల్‌గా రాబోతున్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్నాయి. ఇక ఇందులో ఆండ్రియా చంద్ర పాత్రలో కనిపించనున్నట్లు ప్రకటించింది. ఈ క్రేజీ కాంబినేషన్ ఆండ్రియా కెరీర్‌కు మళ్ళీ పూర్వ వైభవం తెస్తుందని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు.



# ఆనంద్ దేవరకొండ 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' రిలీజ్ డేట్ ఫిక్స్!

మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్లో నటిస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్న యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. '90s' వెబ్ సిరీస్‌తో అందరి మనసులు దోచుకున్న డైరెక్టర్ ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన తొలి గీతం 'సంచారమే' నెట్టింట సూపర్ రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంది. దీంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. 'ఎపిక్' చిత్రాన్ని ఏప్రిల్ 30కి రిలీజ్ చేసే ప్లాన్‌లో ఉన్నారట మేకర్స్. రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ఏప్రిల్ 30న రిలీజ్‌కు ఉండగా.. దాదాపుగా ఈ చిత్రం వాయిదా పడబోతున్నట్లు తెలుస్తుంది. మేడే, వీకెండ్స్ దృష్టిలో పెట్టుకుని ఇంత మంచి డేట్‌ను వదులుకోకూడదనే ఉద్దేశ్యంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అదికారిక ప్రకటన వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక పెద్ది వాయిదాతో పలు చిత్రాలే ఏప్రిల్ 30కి రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.






# ఎరక్క పోయి ఇరుక్కు పోయారా?

అక్కినేని అఖిల్ చాలా గ్యాప్ తీసుకుని చేస్తున్న సినిమా 'లెనిన్'. ఏజెంట్ తర్వాత ఆయన ఎలాంటి సినిమా చేస్తాడా అని ఎదురుచూస్తున్న క్రమంలో, మురళీకృష్ణ అబ్బూరి దర్శకత్వంలో 'లెనిన్' అనే సినిమా అనౌన్స్ చేశారు. నాగవంశీతో పాటు నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా మీద అక్కినేని అభిమానులు చాలా ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ సినిమా ఇంకా పూర్తి కాలేదు. కొంత షూట్ పెండింగ్ ఉండడంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే మే ఒకటో తేదీన రిలీజ్ కావాల్సిన ఈ సినిమాని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అయితే తెలివిగా రామ్ చరణ్ 'పెద్ది' సినిమా ఏప్రిల్ 30వ తేదీన రిలీజ్ అవుతుంది, ఆయనకు అఖిల్ కి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో సినిమా రిలీజ్ చేయడం లేదంటూ ప్రకటించారు. అయితే ఇప్పుడు లెనిన్ టీం ఇరకాటంలో పడే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఏప్రిల్ 30వ తేదీన రావాల్సిన 'పెద్ది' జూన్ 25వ తేదీకి వాయిదా పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దాదాపుగా లెనిన్ కూడా అదే సమయానికి ఇప్పుడు రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాబట్టి మరోసారి పెద్ది వంకతో వాయిదా వేస్తారా లేక పెద్ది రిలీజ్ కావడం లేదు కాబట్టి ముందు చెప్పిన డేట్ కి ప్రీపోన్ చేసి రిలీజ్ చేస్తారా అనేది తెలియాల్సి ఉంది. మొత్తం మీద ప్రీపోన్ చేసి రిలీజ్ చేసే అవకాశాలు అయితే లేవని చెబుతున్నారు, ఎందుకంటే ఇంకా షూట్ పెండింగ్ ఉందని అంటున్నారు. ఇక మొత్తంగా చూస్తే ఎరగకపోయి లెనిన్ టీం ఇరుక్కుపోయినట్లే అనిపిస్తోందని టాలీవుడ్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# పాపం పెద్ది.. మంచి మంచి డేట్లు మిస్సవుతున్నాయ్

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే రిలీజ్ కావలసి ఉంది. ముందుగా ఈ సినిమాని మార్చి 27వ తేదీన రిలీజ్ చేస్తామని ప్రకటించారు. అయితే షూట్ పూర్తి కాకపోవడంతో దాన్ని ఏప్రిల్ 30వ తేదీకి వాయిదా వేశారు. నిజానికి మార్చి 27వ తేదీన రిలీజ్ అయ్యి ఉంటే, శ్రీరామనవమి సెలవుల అడ్వాంటేజ్ కలిసి వచ్చేది. అయితే అది మిస్సయిన క్రమంలో 30వ తేదీన రిలీజ్ చేసి ఉంటే, మే ఒకటో తేదీ సెలవులు కలిసి వచ్చేవి. కానీ ఇప్పుడు ఆ డేట్ కూడా మిస్ అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తర్వాత జూన్ 25వ తేదీన రిలీజ్ చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతుంది, కానీ ఇప్పటివరకు దానిమీద సరైన క్లారిటీ లేదు.

అయితే దాదాపుగా ఏప్రిల్ 30వ తేదీన కూడా వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అని చెబుతున్నారు. షూట్లో రామ్ చరణ్ నుదుటి మీద గాయం కావడంతో సహా, మరికొంత షూట్ పెండింగ్ ఉండడంతోనే సినిమా వాయిదా వేయబోతున్నట్లు తెలుస్తోంది. అయితే టీం మాత్రం ఇప్పటివరకు వాయిదా వేస్తున్న విషయాన్ని చెప్పలేదు, కానీ రెండు గోల్డెన్ డేట్స్ మిస్ అయినట్లు మాత్రం టాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరి త్వరలోనే ఈ మేరకు అధికారిక ప్రకటన చేస్తారా లేక చెప్పిన డేట్ కే రిలీజ్ చేస్తారా అనేది చూడాల్సి ఉంది.




## సినిమా అవకాశాల కోసం లొంగిపోతున్నారు..

# ఇది సరైన పద్ధతి కాదు..

టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సత్యకృష్ణ, తాజాగా క్యాస్టింగ్ కౌచ్ అంశంపై చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. బొమ్మరిల్లు, దేవదాస్, వినాయకుడు, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వంటి సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించిన ఆమె, పరిశ్రమలో ఉన్న చీకటి కోణాల గురించి తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. సాధారణంగా సినిమా ఇండస్ట్రీలోనే క్యాస్టింగ్ కౌచ్ ఎక్కువగా ఉంటుందనే విమర్శలపై సత్యకృష్ణ స్పందిస్తూ.. "కేవలం సినిమా రంగమే కాదు, ప్రతి రంగంలోనూ ఈ సమస్య ఉంది. కాకపోతే మా రంగంలో ఉన్నవారు ధైర్యంగా బయటకు వచ్చి చెబుతున్నారు కాబట్టి అందరికీ విషయాలు తెలుస్తున్నాయి. అందమైన మహిళల పట్ల అవతలి వ్యక్తులకు ఆకర్షణ కలగడం అనేది సహజమైన విషయం.

కానీ, ఎవరైనా తన పరిమితులు దాటుతున్నప్పుడు వెంటనే నో అని చెప్పగలిగే ధైర్యం మహిళలకు ఉండాలి" అని ఆమె అన్నారు. వ్యక్తిగతంగా తనకు ఇప్పటి వరకు ఇలాంటి చేదు అనుభవాలు ఎదురుకాలేదని స్పష్టం చేస్తూనే, తన తోటి మహిళా నటీమణులు పడుతున్న ఇబ్బందులను తాను కళ్ళారా చూశానని ఆవేదన వ్యక్తం చేశారు. "సినిమా అవకాశాల కోసం కొంతమంది కాదనలేక తప్పుదోవ పడుతున్నారు. ఇది అస్సలు సరైన పద్ధతి కాదు. సినిమా లేకపోతే జీవితమే లేదు అని భ్రమపడే వారే ఇలాంటి వలలో పడుతున్నారు" అని చెప్పుకొచ్చారు. అవకాశాల కంటే ఆత్మగౌరవం ముఖ్యమని, ధైర్యంగా నిలబడితేనే ఇలాంటి సమస్యలను అరికట్టగలమని సత్యకృష్ణ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

